క్లుప్తంగా

మొలకశాతాన్ని పరీక్షించాలి

• ఏపీ సీడ్స్ ఎండీ పద్మ



ఏఆర్‌పేట ఆర్‌బీకేలో రికార్డులు పరిశీలిస్తున్న ఏపీ సీడ్స్ ఎండీ పద్మ

జామి: వరి విత్తనాల మొలకశాతాన్ని తప్పనిసరిగా పరీక్షించాలని ఏపీ సీడ్స్ ఎండీ పద్మ తెలిపారు. మండలంలోని జామి, జాగరం, ఏఆర్ పేట గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల (ఆర్బీకే)ను ఏడీఏ అన్నపూర్ణతో కలిసి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతుభరోసా కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు. పచ్చిరొట్ట విత్తనాలు తీసుకున్న రైతులతో మాట్లాడి, పలు సూచనలు చేశారు. రైతుభరోసా కేంద్రాల పని తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీఏఏలు గీత, అలేఖ్య, ఉషా, అజీజ్, శివ, తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ఎస్ఐ

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామానికి చెందిన 13 ఏళ్ల బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించామని ఎస్ఐ ఎల్.దామోదరరావు తెలిపారు. వెదుళ్లవలసకు చెందిన నెమ్మాది సురేష్ ఈ నెల 24వ తేదీ రాత్రి 9 గంటల సమయంలో తప్పిపోయాడంటూ బాలుడి తండ్రి నెమ్మాది రామారావు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ దామోదరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది విచారణ చేపట్టి బాలుడ్ని విశాఖపట్నంలో పట్టుకుని కుటుంబ సభ్యులకు శనివారం అప్పగించారు.

ఘన,ద్రవ జీవామృతం తయారీపై శిక్షణ



శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి వెంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఘన,ద్రవ జీవామృతం తయారీపై ఏపీ సీఎన్ఎఫ్ ఇన్‌చార్జి బి.శ్రీనివాసరావు శనివారం శిక్షణ ఇచ్చారు. ఘన,ద్రవ జీవామృతాలను ఎలా తయారు చేసుకోవాలి, ఎన్ని రోజులు నిల్వచేసిన తర్వాత పంటలకు పిచికారీ చేయాలనే అంశాలను వివరించారు.

గురుకుల పాఠశాలలకు ఎంపిక



రెసిడెన్షియల్ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులు

జామి: స్థానిక నెయ్యిలవీధి ప్రాథమిక పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు జిల్లాలోని వివిధ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం కన్నాంబ శనివారం తెలిపారు. 4వ తరగతి విద్యార్థులు 13 మంది ప్రవేశ పరీక్ష రాశా రని, వారిలో 10 మంది సీట్లు సాధించారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న శశికళ

విజయనగరం ఫూల్‌బాగ్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని యూటీఎఫ్ నాయకురాలు శశికళ అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కన్వీనర్ నిర్మల ఆధ్వర్యంలో స్థానిక రామకృష్ణానగర్‌లో వేసవి వినోద, విజ్ఞాన కార్యక్రమం శనివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న శశికళ మాట్లాడుతూ.. మూఢ విశ్వాసాలు విడనాడాలని, వాస్తవాలు గెలుసుకోవాలని అన్నారు. సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా పిల్లలకు క్రికెట్ కిట్ అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు జగదాంబ, పలువురు చిన్నారులు పాల్గొన్నారు.

వైభవంగా వైశాఖమాస పూజలు



జామి: భీమసింగిలో పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి



గజపతినగరం: వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



కొత్తవలస: తుమ్మికాపల్లిలోని వేణుగోపాలస్వామి ఆలయం వద్ద దీపారాధన చేస్తున్న సమరసత సేవా సంస్థ సభ్యులు



కొత్తవలస: తుమ్మికాపల్లిలో వేణుగోపాలస్వామికి ఊంజల్ సేవ చేస్తున్న పురోహితులు సతీష్‌స్వామి

గజపతినగరం: వైశాఖ మాసం సందర్భంగా స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో అర్చకులు శ్రీనివాసాచార్యులు స్వామివారికి పూజలు, అభిషేకాలు చేయించారు.

భీమసింగిలో..

జామి: మండలంలోని భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం విశేష పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పూజలు, అభిషేకాలు చేసి, వివిధ పుష్పాలతో అలంకరించారు. భీమసింగితో పాటు చుట్టు పక్క గ్రామాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన కల్యాణ మహోత్సవాలు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలోని వేణుగోపాలస్వామి ఆలయంలో దేవదాయ, ధర్మాదాయశాఖ, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. పురోహితులు ఐ.వి.సతీష్‌స్వామి నేతృత్వంలో వారం రోజులుగా ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి స్వామివారికి ఊంజల్‌సేవ, పుష్పాంజలి,ద్వాదశ తిరువారాధన తదితర పూజా కార్యక్రమాలు చేశారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీపాలంకరణ చేశారు.

భవిత కేంద్రాల్లో చేర్పించండి



రోళ్లవాక గ్రామంలో సర్వే చేస్తున్న ఎంఈఓలు భవిత కేంద్రం ఉపాధ్యాయులు

బొండపల్లి: ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఇంటి వద్ద ఉంచకుండా భవిత కేంద్రాల్లో చేర్పించాలని ఎంఈఓలు శోభారాణి, అల్లు వెంకటరమణ సూచించారు. మండలంలోని రోళ్లవాక గ్రామంలో శనివారం ఇంటింటా సర్వే నిర్వహించి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ముగ్గురిని గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సర్వే చేయిస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటికీ భవిత కేంద్రం ఉపాధ్యాయులు వెళ్లి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి, వారిని భవిత కేంద్రంలో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులు ఎం.లక్ష్మణరావు, ఎస్.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు రెడ్డిపేటలో వైద్య శిబిరం

చీపురుపల్లి: చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని రెడ్డిపేట గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పట్టణానికి చెందిన వైద్యురాలు కాపరోతు శ్రీవేణి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు సాధారణ వైద్యశిబిరం ప్రారంభమవుతుందని, వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగించుకోవాలని సూచించారు.

నేడు రక్తదాన శిబిరం

చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆశయ యూత్ అసోసియేషన్ వార్షికోత్సవం సందర్భంగా ఈ శిబిరం నిర్వహిస్తున్నామని, ఉదయం 9 గంటలకుశిబిరం ప్రారంభమవుతుందని, యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.

పిచ్చి మొక్కల తొలగింపు

వేపాడ: మండలంలోని వావిలపాడు నుంచి కృష్ణారాయుడుపేట వరకు ఉన్న రైవాడ సాగునీటి కాలువలో పిచ్చిమొక్కలు, పూడిక తీత పనులను ఉపాధి హామీ పథకం వేతనదారులు శనివారం ప్రారంభించారు. నీలకంఠరాజపురం కల్వర్ట్ నుంచి బల్లంకి కల్వర్ట్ సమీపం వరకు పనులు చేశారు. రోజుకు రెండు కిలోమీటర్ల మేర పిచ్చిమొక్కలు, పూడిక తీత పనులు చేపట్టనున్నట్లు వర్క్ ఇన్‌స్పెక్టర్ పోలినాయుడు చెప్పారు.

29,30న స్పాట్ అడ్మిషన్లకు కౌన్సెలింగ్

కొత్తవలస: వియ్యంపేట డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకులంలో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీయట్ ప్రథమ సంవత్సరంలో స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 29,30 తేదీల్లో నెల్లిమర్ల గురుకులంలో కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ టి.జయశ్రీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ఎంఈసీ,సీఈసీ గ్రూపుల్లో సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ విద్యార్థినులకు 36 సీట్లు, ఎస్టీ–4, బీసీ–3, బీసీ–సీ6, ఓసీ 1 సీటు, మొత్తం 50 సీట్లకు అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు తెలిపారు 5వ తరగతిలో ఎస్సీ–30, బీసీ సీ–10,ఓసీ–1 మొత్తంగా 41 సీట్ల భర్తీ చేయనున్నట్లు స్పష్టం చేశారు.అడ్మిషన్ల కోస విద్యార్థినులు స్టడీ సర్టిఫికెట్లు, కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలు, 10వ తరగతి మార్కుల మెమోలతో ఉదయం 9 గంటలకు నెల్లిమర్ల గురుకులానికి వెళ్లాలని సూచించారు.

యువకుడి ఆత్మహత్య

పరవాడ: మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో అద్దెకు ఉంటున్న 23 ఏళ్ల యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్టు సీఐ ఎస్.బాల సూర్యారావు చెప్పారు. ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు విజయనగరం జిల్లా మల్లిచర్ల గ్రామానికి చెందిన కోట్ల జగదీష్ (23)గా గుర్తించారు. జగదీష్ పెదముషిడివాడ గ్రామంలో నివాసం ఉంటూ ఎస్ఈజెడ్‌లో ఈసాయి పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శనివారం ఇంట్లో సీలింగ్ ఫ్యాను హుక్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాలసూర్యారావు చెప్పారు.

దోమల నివారణతో వ్యాధులు దూరం




కాపుసోంపురంలో దోమల మందు పిచికారీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

శృంగవరపుకోట: పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను నివారించవచ్చని, తద్వారా మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబల కుండా నియంత్రించవచ్చని, దీనికి ప్రజాసహకారం అవసరమని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి(డీఎంహెచ్ఓ) ఎస్.భాస్కరరావు అన్నారు. దోమల నివారణకు జిల్లా వైద్యారోగ్యశాఖ నేతృత్వంలో మండలంలోని కాపుసోంపురం గ్రామంలో శనివారం చేపట్టిన మొదటి విడత ఏసీఎం 5శాతం ద్రావణం మందు పిచికారీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు.పలువురు గ్రామస్తులతో మాట్లాడి దోమలను నివారించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఐఆర్ఎస్ కార్యక్రమాన్ని వారికి వివరించారు. నివాసపరిసరాలతో పాటు ఇంట్లోని ప్రతీ గదిలో ఏసీఎం 5 శాతం ద్రావణం స్ప్రేయింగ్ చేయించాలన్నారు. నివాస పరిసరాల్లో నీటి నిల్వ, తాగిపడేసిన కొబ్బరి బొండాల చిప్పలు, ఖాళీ టైర్లు లేకుండా చూసు కోవాలని ప్రజలకు సూచించారు. వైద్యారోగ్యశాఖ సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు. ఆయన వెంట కొట్టాం వైద్య సిబ్బంది ఉన్నారు.

కోళ్ల ఫారం వ్యర్థాల తొలగింపు

• కోళ్ల ఫారం యజమానులకు నోటీసులు



చెరువుగట్టుపై వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్...

మెరకముడిదాం: స్థానిక కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయానికి (కేజీబీవీ) సమీపంలో ఉన్న చెరువు గట్టుపై కోళ్ల ఫారాల నిర్వాహకులు ఇష్టారీతిగా వ్యర్థాలను పారబోస్తున్నారు. దీంతో కేజీబీవీ విద్యార్థినులతో పాటు అటువైపుగా వెళ్లే వారంతా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.దీనిపై 'కోళ్ల ఫారం వ్యర్థాలతో అవస్థలు' శీర్షికతో సాక్షి దినపత్రికలో శనివారం కథనం ప్రచురితమైంది. ఈకథనానికి ఎంపీడీఓ ఎం.పావని స్పందించారు. చెరువు గట్టుపై కోళ్ల ఫారం వ్యర్థాలను తొలగించాలని పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓను ఆదేశించారు. దీంతో వారు ఆ ప్రాంతానికి వెళ్లి వ్యర్థాల తొలగింపు పనులు చేయించారు. అలాగే కోళ్లఫారం యజమానులకు నోటీసులు అందజేశారు. మరోసారి వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడే పారబోస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు అనుమతి లేదు



దమరసింగి గ్రామ పెద్దల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ షణ్ముఖరావు

గుర్ల: ఎన్నికల కోడ్ అమలులో ఉందని, గ్రామదేవతల పండగల నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, బాణసంచా కాల్చడం వంటి కార్యక్రమాలకు అనుమతి లేదని సీఐ షణ్ముఖరావు చెప్పారు. మండలంలోని దమరసింగి గ్రామంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు గ్రామదేవత శ్యామలాంబ పండగ ను నిర్వహించనున్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో దమరసింగి గ్రామపెద్దలతో సీఐ శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ గలో జానపద, పౌరాణిక నాటకాలు, ఇతర సాంస్కృతికార్యక్రమాలు దేనికీ అనుమతి లేదన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉందని గ్రామంలో ఎలాంటి ఘర్షణలు జరిగినా గ్రామ పెద్దలే బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ఎస్ఐ భాస్కరరావు, గ్రామ పెద్దలు మీసాల ప్రసాద్, పిన్నింటి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ ధరణి

వేపాడ:

రానున్న వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వేపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారి ధరణి సిబ్బందికి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలతో శనివారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్నందున వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఉపాధి వేతనదారులకు వివరించాలని చెప్పారు. అలాగే పని ప్రదేశంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా, వాటిని వారు వినియోగించేలా చూడాలన్నారు. గ్రామాల్లో గర్భిణుల వివరాల నమోదును పక్కాగా చేపట్టాలన్నారు. క్షయ నివారణ కోసం ప్రతీ గురువారం బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ వ్యాక్సిన్ వృద్ధులకు అందేలా చూడాలన్నారు. జూన్4న వావిలపాడు,18న వీలుపర్తిలో నిర్వహించనున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను విజయవంతం చేయాలని, ముందుగా ఆయా గ్రామాల్లో దండోరా వేయించాలని ఆదేశించారు. సీహెచ్ఓ ఆంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్ రమణ, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు,సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



కొత్తవలస: మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్



వేపాడ: శింగరాయి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రాజేష్

కొత్తవలస: ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ఎస్.చంద్రశేఖర్ హెచ్చరించారు. స్థానిక సర్కిల్ కార్యాల యంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకున్నామని, అలాగే ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు అదే వాతావరణం కొనసాగే లా ప్రజలంతా సహకరించాలని కోరారు. తగాదాలకు దిగకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించా లని సూచించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు గ్రామాల్లో సభలు,సమావేశాలు నిర్వహించకూడదని, ఫలితాలు రోజున బాణసంచా కాల్చడం, ఊరేగింపులు వంటివి చేయరాదన్నారు. ఎస్ఐ సుదర్శన్ పాల్గొన్నారు.

తగాదాలకు దూరంగా ఉండాలి

దత్తిరాజేరు: యువత తగాదాలకు దూరంగా ఉండాలని, రాజకీయాల పేరిట అనవసరంగా తగదాలకు దిగి కేసుల్లో ఇరుక్కోవద్దని ఎస్. భూర్జవలస ఎస్ఐ లక్ష్మీప్రసన్న కుమార్ సూచించారు. ఎస్.భూర్జవలస పోలీస్ స్టేషనల్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల కౌంటింగ్ ఉంటుందని, ఆరోజు ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేయకతప్పదని హెచ్చరించారు. తగాదాలకు పాల్పడినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవన్నా రు.కౌంటింగ్‌కు ముందు రోజు పోలీస్ బృందాలు గ్రామాలను సందర్శిస్తాయని తెలిపారు.

ర్యాలీలకు అనుమతి లేదు

వేపాడ: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు జూన్4న వెలువడనున్నాయని, విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చేందుకు అనుమతులు లేవని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని వల్లంపూడి ఎస్ఐ రాజేష్ అన్నారు. మండలంలోని శింగరాయి గ్రామంలో శనివారం సాయంత్రం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఇంకా అమలులోనే ఉందని చెప్పారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, ఎంపీటీసీ రాజీవ్, పెద్దలు కండిపల్లి అమ్మతల్లినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సేవల్లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం

• డీఎంహెచ్ఓ భాస్కరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ భాస్కరరావు

జామి: వైద్యసేవలు, ఆరోగ్య కార్యక్రమాల్లో సిబ్బంది నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదని డీఎంహెచ్ఓ భాస్కరరావు అన్నారు. మండలంలోని అలమండ పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీలో ప్రసవాలు, వైద్య సేవలపై వైద్యాధికారి కె.వి.ఎస్.పద్మావతిని అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల వారీగా సిబ్బంది అందించిన మాతా,శిశుసంరక్షణ సేవలపై ఆరా తీశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల సాధనలో ముందుండాలని సిబ్బందికి సూచించారు. గర్భిణుల వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత యాప్‌లో నమోదు చేసి, వారికి అందించే సేవల వివరాలను అప్‌లోడ్ చేయాలని చెప్పారు. వైద్య సిబ్బంది పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోండి



పెదవేమలి ఆర్బీకేలో విత్తన నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ నాగభూషణం

గంట్యాడ: వరి, పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమపేర్లను రైతు భరోసా కేంద్రా(ఆర్బీకే)ల్లో రిజిస్ట్రేషన్ చేయించు కోవాలని ఏడీఏ నాగభూషణం సూచించారు. మండలంలోని పెదవేమలి, సిరిపురం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో నిల్వచేసిన వరి విత్తనాలను శనివారం ఆయన పరిశీలించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకే విత్తనాలు పంపిణీ చేస్తామని చెప్పారు. ఆర్బీకేల్లో ప్రస్తుతం ఎంటీయూ–1121 రకం వరి విత్తనాలు అందుబాటు లో ఉన్నాయని, సోనామసూరి, సాంబమసూరి రకం విత్తనాలను త్వరలో సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే ఆర్బీకేల్లో పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆయన వెంట వ్యవసాయ శాఖ అధికారులు అన్నపూర్ణ, శ్యామ్‌కుమార్, వీఏఏ ప్రమీల తదితరులు ఉన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే గరిష్ట వేతనం



బొండపల్లి: జి.పి.అగ్రహారంలో వేతనదారుల మస్టర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు



చీపురుపల్లిరూరల్(గరివిడి): గదబవలసలో వేతనదారులకు సూచనలు చేస్తున్న ఏపీఓ కనకరాజు

బొండపల్లి: ఉపాధి హామీ పథకం సిబ్బంది ఇచ్చిన కొలతల ప్రకారం ఉపాధి పనులు చేస్తే వేతనదారులకు ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు చెప్పారు. జి.పి.అగ్రహారం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను శని వారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడు తూ పనులకు జాబ్ కార్డు ఉన్న వారు మాత్రమే హాజరు కావాలని చెప్పారు. పని ప్రదేశంలో వేతనదారుల కోసం తప్పని సరిగా తాగునీరు, నీడ కోసం టెంట్లు ఏర్పాటు చేయాలని, ప్రథమ చికిత్స కిట్లను అందు బాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఉదయం తొందరగా పని ప్రారంభించి, 11 గంటలకు ముగించాలని చెప్పారు.

పని ప్రదేశంలో టెంట్లు తప్పనిసరి

చీపురుపల్లిరూరల్(గరివిడి): ఉపాధి పనులు చేపట్టే ప్రదేశాల్లో వేతనదారులకు నీడ సదుపాయం కోసం తప్పనిసరిగా టెంట్లు అందుబాటులో ఉంచాలని ఏపీఓ కనకరాజు ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లకు సూచించారు.గరివిడి మండలంలోని గదబవలస గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 6:30 గంటలకే పనులకు హాజరు కావాలని సూచించారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరాలు



ఎల్.కోట గ్రంథాలయంలో పేపర్లతో తయారు చేసిన బొమ్మలను చూపిస్తున్న విద్యార్థులు



కొత్తవలస గ్రంథాలయంలో తాము గీచిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

కొత్తవలస/లక్కవరపుకోట: శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా కొనసాగుతున్నాయి.కొత్తవలస, ఎల్.కోట గ్రంథాలయాల్లో ఈ శిబిరాలు ఉల్లాసంగా సాగుతు న్నాయి. రోజు రోజుకూ విద్యార్థుల హాజరు సంఖ్య పెరుగుతోందని లైబ్రేరియన్‌లు బి.మేరి, ఎం.రామలక్ష్మి తెలిపారు. ఎల్.కోట గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులు పేపర్లతో వివిధ రకాల బొమ్మలు, కళాకృతులు తయారు చేశారు. అలాగే చదరంగం, క్యారమ్స్ ఆటలను నేర్పారు.కొత్తవలస గ్రంథాలయంలో చిన్నారులకు డ్రాయింగ్ నేర్పించారు. నీతి కథలు చదివించారు.